క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే కంచర్ల

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని బోయవాడకు చెందిన నయనాల వెంకన్న దంపతులు అనారోగ్యంతో బాధపడుతుండడంతో మంగళవారం నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. పూర్తి స్థాయిలో వైద్యం అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

మునుగోడు : మండలంలోని ఇప్పర్తి గ్రామానికి చెందిన జుట్టు వెంకన్న ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ మేరకు మంగళవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నారబోయిన రవికుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట సర్పంచ్ బొజ్జ సుజాత శ్రీను, వైస్ ఎంపీపీ అనంత వీణలింగస్వామి, ఆడెపు సైదులు, దోటి సైదులు, జంగిలి నాగరాజు, జెట్టి గణేశ్, బండారు మల్లేశం ఉన్నారు.

ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

నకిరేకల్ : నియోజకవర్గ పరిధిలో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ నేత దైద రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నకిరేకల్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నకిరేకల్ నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధి శూన్యమని, ఇక్కడి యువత వలస పోయి పని చేసుకునే పరిస్థితి నెలకొందన్నారు. నకిరేకల్ నియోజకవర్గం నేషనల్ హైవేపై విస్తరించి ఉన్నా పారిశ్రామిక అభివృద్ధి జరగలేదన్నారు.

ఉత్తమ చేనేత కార్మికుడిగా కర్నాటి శ్రీనివాసులు



అవార్డు అందుకుంటున్న శ్రీనివాసులు

చండూరు : చండూరుకు చెందిన కర్నాటి శ్రీనివాసులు జిల్లా ఉత్తమ చేనేత కార్మికుడిగా ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శ్రీనివాసులుకు మంగళవారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, రవీంద్రకుమార్, భగత్ అవార్డు అందజేశారు. చేనేత కార్మికుడిగా రాణిస్తూ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్నందుకు గాను శ్రీనివాసులును జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారులు అవార్డుకు ఎంపిక చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో ఆయిల్ చోరీ

రామగిరి(నల్లగొండ) : ట్రాన్స్‌ఫార్మర్లలో ఆయిల్ చోరీకి గురైన సంఘటన తిప్పర్తి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తిప్పలమ్మగూడెం, దుప్పలపల్లి వద్ద ట్రాన్స్‌ఫార్మర్లలో జూన్ 2వ తేదీ తెల్లవారుజామున ఆయిల్ చోరీ జరిగింది. గతంలో మల్లెపల్లివారి గూడెం వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌లో కూడా ఆయిల్ చోరీ జరిగింది. విద్యుత్ ఏఈ రమ్యారెడ్డి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పలువురికి జరిమానా

నల్లగొండ : మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాతోపాటు జైల్ శిక్ష తప్పదని ట్రాఫిక్ సీఐ చీర్ల శ్రీను హెచ్చరించారు. సోమవారం వాహనాల తనిఖీల్లో భాగంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 16 మంది పట్టుబడ్డారన్నారు. ఇందులో ముగ్గురికి కోర్టు మూడు రోజుల జైలు, జరిమానా విధించిందన్నారు. మిగిలిన 13 మందికి రూ.23వేల జరిమానా విధించిందని తెలిపారు. ప్రమాదాల నివారణ లక్ష్యంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని సీఐ తెలిపారు.

నీరా కేఫ్‌లను ఏర్పాటు చేయాలి

చిట్యాల : జాతీయ రహదారిపై ఉన్న చిట్యాల మున్సిపల్ కేంద్రంలో నీరా కేఫ్‌లను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి డిమాండ్ చేశారు. చిట్యాలలో మంగళవారం నిర్వహించిన గౌడ, గీత కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ స్మారక భవనాలు ఏర్పాటు చేయాలన్నారు. కల్లు గీత కార్మికులు గాయపడి మృతి చెందితే రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. సిగ స్వామిగౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వడ్డగోని విజయకుమారి, కొప్పు లావణ్య, ఉయ్యాల లింగస్వామిగౌడ్, ఉయ్యాల యాదగిరిగౌడ్, బూరుగు నరేష్‌గౌడ్, నరేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నూనె వెంకటస్వామి

చండూరు మార్కెట్‌కు మహర్దశ

- మార్కెటింగ్ శాఖ నుంచి రూ.3.96 కోట్లు మంజూరు
- ఆ నిధులతో చండూరులో షాపింగ్ కాంప్లెక్స్
- నారాయణపురంలో సబ్ మార్కెట్ కార్యాలయం
- మునుగోడులో ప్రహరీ నిర్మాణం



చండూరు మార్కెట్ కార్యాలయం

చండూరు : చండూరు వ్యవసాయ మార్కెట్, దాని పరిధిలోని సబ్ మార్కెట్‌ల అభివృద్ధికి మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి చొరవతో తెలంగాణ రాష్ట్ర మార్కెటింగ్ శాఖ నుంచి నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో మార్కెట్ అభివృద్ధి చెంది ఆదాయం పెరగనుంది. చండూరు మార్కెట్ పరిధిలోని సంస్థాన్ నారాయణపురంలో సబ్ మార్కెట్ యార్డు ఉన్నా కార్యాలయం లేకపోవడంతో రైతులు, అధికారులు ఇబ్బంది పడుతూ వస్తున్నారు. ఏళ్లుగా మార్కెట్‌లో రైతులకు ఎలాంటి లావాదేవీలు జరగలేదు. మునుగోడు సబ్ మార్కెట్ యార్డుకు సైతం ఆదాయ మార్గాలు లేవు. కొంత కాలంగా మార్కెట్‌కు రైతులు పండించిన ధాన్యం, పత్తి ద్వారానే ఆదాయం వస్తోంది. ఇక నుంచి మార్కెట్ యార్డు స్థలాల్లో కాంప్లెక్స్‌లు నిర్మించనుండడంతో అదనపు ఆదాయం రానుంది. దీంతో చండూరు వ్యవసాయ మార్కెట్‌తోపాటు సబ్ మార్కెట్‌లు సైతం బలోపేతం కానున్నాయి.

రూ.3.96 కోట్లు మంజూరు..

చండూరు వ్యవసాయ మార్కెట్‌తోపాటు దాని పరిధిలోని సంస్థాన్ నారాయణపురం, మునుగోడు సబ్ మార్కెట్ యార్డులకు తెలంగాణ రాష్ట్ర మార్కెటింగ్ శాఖ నుంచి రూ.3.96 కోట్లు మంజూరయ్యాయి. చండూరు వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ముందు భాగంలో (మెయిన్ రోడ్డు) షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు రూ.1.80 కోట్లు, మునుగోడు సబ్ మార్కెట్ యార్డు (నల్లగొండ రోడ్డుకు) ముందు భాగంలో రూ.90 లక్షలతో కాంప్లెక్స్ నిర్మాణం, సంస్థాన్ నారాయణపురం సబ్ మార్కెట్‌లో కార్యాలయం, ప్రహరీ నిర్మాణానికి రూ.1.26 కోట్ల నిధులు మంజూరయ్యాయి. మంజూరైన నిధులతో త్వరలో పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని మార్కెట్ చైర్‌పర్సన్ మాధవి తెలిపారు.

టెండర్ దశలో..

చండూరులో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు, సంస్థాన్ నారాయణపురం సబ్‌మార్కెట్‌లో కార్యాలయం, ప్రహరీ నిర్మాణానికి టెండర్ ప్రక్రియ కొనసాగుతోంది. టెండర్ ప్రక్రియ ముగియగానే త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. నారాయణపురంలో కార్యాలయం ఏర్పాటుతో ఆ ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మార్కెట్ మరింత అభివృద్ధి చెందుతుంది



చండూరు మార్కెట్ అభివృద్ధికి తెలంగాణ మార్కెటింగ్ శాఖ నుంచి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డికి కృతజ్ఞతలు. మంజూరైన నిధులతో పనులు పూర్తయితే మార్కెట్ మరింత అభివృద్ధి చెందుతుంది.

– గుర్రం మాధవి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్

శాలిగౌరారం : రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించనున్న కార్యాలయ భవనానికి మంగళవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కాని రైతు, ప్రజా సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ తెలంగాణలో అమలుచేస్తూ ఆదర్శంగా నిలిచారన్నారు. రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్షాలు తట్టుకోలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని అన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా మూడోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తేజస్వి, ఎంపీపీ గంట లక్ష్మమ్మ, జెడ్పీటీసీ ఎర్ర రణీల, తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ లక్ష్మయ్య, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఐతగోని వెంకన్న, మామిడి సర్వయ్య, కట్ట వెంకట్‌రెడ్డి, గంట శంకర్, చంద్రమౌళి ఉన్నారు.

నేడు సన్నాహక సమావేశం

నల్లగొండ టూటౌన్ : మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గంలోని అన్ని మోర్చాల సంయుక్త సన్నాహక సమావేశం బుధవారం నల్లగొండలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పోతెపాక సాంబయ్య మంగళవారం తెలిపారు. మోర్చాల నాయకులు, పదాధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

కొనసాగుతున్న దీక్షలు

మునుగోడు : మండలంలోని కిష్టాపురం గ్రామంలో నిర్మిస్తున్న ఫార్మా కంపెనీ పనులు వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామస్తులు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు 47 రోజు కొనసాగాయి. మంగళవారం దీక్షలో అఖిలపక్ష పార్టీల నాయకులు కూర్చున్నారు. ఫార్మా వ్యతిరేక కమిటీ కన్వీనర్ భీమనపల్లి సైదులు, పూసల సంఘం సభ్యులు నూతకంటి కిరణ్, వెంకన్న పాల్గొన్నారు.

కుళాయిలకు మోటార్లు పెడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న కమిషనర్ కేవీ.రమణాచారి

నల్లగొండ టూటౌన్ : కుళాయిలకు మోటార్లు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ కేవీ.రమణాచారి అన్నారు. మంగళవారం నీలగిరి పట్టణంలో ఎల్‌ఎస్ గుట్ట వద్ద తాగు నీటి సరఫరాపై సంబంధిత ఉద్యోగులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తాగు నీటి సరఫరా చేయాలని సిబ్బందికి సూచించారు. వేసవి కాలం ముగుస్తున్నందున రాబోయే వర్షాకాలంలో లీకేజీ సమస్యలు రాకుండా చూడాలన్నారు. ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు. నల్లా బిల్లుల బకాయిలు వెంటనే చెల్లించాలని, బిల్లులు చెల్లించకపోతే నల్లా కనెక్షన్ కట్ చేస్తామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఈఈ రాములు, ఏఈ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహకాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే కంచర్ల, చిత్రంలో కలెక్టర్, తదితరులు



సమావేశంలో పాల్గొన్న పారిశ్రామిక వేత్తలు

- టీఎస్ ఐ పాస్ ద్వారా జిల్లాలో 608 కొత్త పరిశ్రమలు
- తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవంలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నల్లగొండ : రాష్ట్ర ప్రభుత్వం సరళీకృత విధానాల ద్వారా కొత్త పారిశ్రామిక సంస్థల స్థాపనకు అనేక రకాల ప్రోత్సాహకాలు అందిస్తోందని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో 'తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యేలు నోముల భగత్, రవీంద్ర కుమార్, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా భూపాల్ రెడ్డి మాట్లాడుతూ 2014వ సంవత్సరానికి ముందు కరెంటు కష్టాలతో అనేక పరిశ్రమలు, చేనేత, జౌళి శాఖ పరిశ్రమలు మూతపడ్డాయని, కార్మికులు రోడ్డున పడి ఉపాధి కోల్పోయారని అన్నారు. కానీ నేడు 24 గంటలు విద్యుత్ సరఫరాతో చేనేత పవర్ లూం పరిశ్రమలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్రం ఏర్పాటు తర్వాత టీఎస్ ఐపాస్ ద్వారా నల్లగొండ జిల్లాలో కొత్తగా 608 పరిశ్రమలు స్థాపించినట్లు తెలిపారు. తెలంగాణలో గత పాలకుల కాలంలో పరిశ్రమలు స్థాపించాలన్నా, పెట్టుబడులు పెట్టాలన్నా ఎవరూ ముందుకు రాలేదన్నారు. కానీ నేడు 50 వేల కంపెనీలు, పారిశ్రామిక సంస్థలు తెలంగాణకు వచ్చాయని, 35 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమలు, ఐటీ, వ్యవసాయ రంగంలో తెలంగాణ రాష్ట్రం ప్రగతి పథంలో ఉందని తెలిపారు. చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా ఉండి భరోసా కల్పిస్తోందన్నారు. నేత కార్మికులు ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల బీమా అందజేస్తున్నామన్నారు. జిల్లాలో ఫుడ్ ప్రాసెస్ యూనిట్ల స్థాపనకు కృషి చేస్తున్నామన్నారు. దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడ్డాక అభివృద్ధి సంక్షేమ పారిశ్రామిక రంగాల్లో అగ్రగామిగా ఉన్నామన్నారు. నల్లగొండ జిల్లాలో రైస్ మిల్లులు, సిమెంట్ ఫ్యాక్టరీలు, పరిశ్రమలు స్థాపించారని తెలిపారు. మంత్రి కేటీఆర్ సహకారంతో నూతనంగా ఐటీ టవర్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను అదుపులో ఉంచడం వల్ల గూగుల్, ఆపిల్, అమెజాన్, తదితర కంపెనీలు మన రాష్ట్రానికి వచ్చాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వర్గాలకు రాయితీలు కల్పించి యువకులను, మహిళలను పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ నల్లగొండ జిల్లా కేంద్రంలో, మిర్యాలగూడలో రెండు చోట్ల పారిశ్రామిక ప్రగతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో రైతాంగం ఎక్కువగా వ్యవసాయం చేసి పంట ఉత్పత్తిని పెంచారని, పంటలకు అనుగుణంగా జిల్లాలో పారిశ్రామికవేత్తలు రైస్ మిల్లులు ప్రారంభించారన్నారు. పారిశ్రామిక రంగంలో టీఎస్ ఐపాస్ అనేది దేశంలోనే ఒక గొప్ప విధానమన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించిన 15 రోజుల్లో పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ పారిశ్రామిక వేత్తలను, ఇన్నోవేటర్లను సన్మానించారు. పరిశ్రమల శాఖ, చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో తమ ఉత్పత్తులపై ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, ఎంపీపీలు విజయలక్ష్మి, కరీం పాషా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున రెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం. కోటేశ్వరరావు, చేనేత, జౌళి శాఖ ఏడీ ద్వారక్, పారిశ్రామిక వేత్తలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేద ప్రజలకు వరం



చెక్కులు అందజేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు వరం అని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన 13 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.8,70, 500 విలువ గల సీఎం సహాయ నిధి చెక్కులను మంగళవారం నల్లగొండ పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా గుత్తా మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతిఒక్కరికి ఏదో ఒక రూపంలో సంక్షేమ పథకం అందుతోందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్ర భాగాన నిలిచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కంచరకుంట్ల గోపాల్‌రెడ్డి, నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, ఐతగాని స్వామిగౌడ్, మునాస వెంకన్న, రాములు, హరికృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణంలోని పానగల్లు శ్రీ ప్రహ్లాద వరద లక్ష్మీనరసింహస్వామి కల్యాణం మంగళవారం కనులపండువగా జరిగింది. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం మండప పూజతో ప్రారంభమై స్వామివారికి మహా కుంభాభిషేకం, అలంకారం, బలి నివేదన, పూర్ణాహుతి, శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాపోలు శ్రీనివాస్, తోట రామాంజనేయులు, బూరుగు బాలకిషన్, చొక్కారపు వెంకన్న, మాధవి, విజయమోహన్, మిర్యాల యాదయ్య, మిట్టపల్లి రాజేందర్, వనమా నరసింహ, సాంబశివ, భారతి, ఉమారాణి, సైదులు, దేవేందర్, వాసుదేవ్, శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

ఉద్యోగాలను భర్తీ చేయాలి

చండూరు(గట్టుప్పల) : రైల్వే శాఖలో ఉద్యోగాలను భర్తీ చేయాలని తెలంగాణ విద్యార్థి, యువజన, నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అవ్వారు వేణు కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గ్యాంగ్‌మెన్, స్టేషన్ మాస్టర్ ఉద్యోగాలు భర్తీ చేయకపోవడం వల్ల రైలు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు.

ఆపదలో ఉన్నవారికి మేమున్నామంటూ..

- ఆర్థిక సహాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు
- అభినందిస్తున్న ప్రజలు



ఆర్థిక సహాయం అందజేస్తున్న ఉరుమడ్ల జెడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థులు

చిట్యాల : పాఠశాల స్థాయిలో మొదలైన స్నేహం నిస్వార్థంగా ఉంటుంది. అలాంటి బాల్యమిత్రులు జీవన గమనంలో వేర్వేరు చోట్ల, వేర్వేరు ఉద్యోగాల్లో స్థిరపడినప్పటికీ స్నేహాన్ని అలాగే కొనసాగిస్తున్నవారు ఎందరో ఉన్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనాలను నిర్వహించుకుంటూ తరచూ కలుసుకుంటున్నారు. బాల్యమిత్రులు తమ సంతోషాలను పంచుకోవడంతోపాటు ఒకరి కష్టాలను ఒకరు తెలుసుకుంటున్నారు. ఆపదలో ఉన్నారిని, మృతి చెందిన స్నేహితుల కుటుంబాలకు ఆసరాగా నిలుస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తూ, ఆపన్నహస్తాన్ని అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు చిట్యాల మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రభుత్వ జెడ్పీహెచ్‌ఎస్‌ల పూర్వ విద్యార్థులు.

ఆర్థిక తోడ్పాటు ఇలా..

చిట్యాల మండలంలో పలు ప్రభుత్వ జెడ్పీహెచ్‌ఎస్‌లలో పూర్వ విద్యార్థులు గత ఆరు నెలల కాలంలో ఆర్థిక సహాయం అందించిన వివరాలివున్నాయి.

- చిట్యాల జెడ్పీహెచ్‌ఎస్ 1998–99 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు తమతో కలిసి చదువుకున్న తోటి స్నేహితురాలు అలివేలు మంగ కిడ్నీ సమస్యతో బాధపడుతుందని తెలుసుకుని వైద్య చికిత్సకుగాను రూ.67 వేల నగదు అందించారు. అదే బ్యాచ్‌కు చెందిన పల్లెమోని నిర్మల కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని తెలుసుని రూ.36,500 అందించారు. అనారోగ్యంతో మృతి చెందిన బొడ్డుపల్లి నర్సింహ కుటుంబ సభ్యులకు రూ.52,500 అందించారు.
- ఎలికట్టె జెడ్పీహెచ్‌ఎస్ 2006–07 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన మూడుదుడ్ల శ్రీనివాస్ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతడి కుటుంబానికి ఆ బ్యాచ్ విద్యార్థులు రూ.1,00,000 అందజేశారు. అతడితో కలిసి చదువుకున్న 2007–09 ఇంటర్ విద్యార్థులు రూ. 50 వేలు అందించారు.
- చిట్యాల జెడ్పీహెచ్‌ఎస్ 1989–90 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు వట్టి నరేందర్‌రెడ్డి, వంగాల నర్సింహ మృతి చెందారు. దీంతో మృతుల కుటుంబ సభ్యులకు ఒక్కోక్క కుటుంబానికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు.
- చిట్యాల జెడ్పీహెచ్‌ఎస్ 1990–91 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు బద్దుల యాదయ్య, తండు శ్రీనివాస్ మృతి చెందారు. దీంతో వారిద్దరి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10,500 చొప్పున, రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఎద్దు శ్రవణ్‌కుమార్‌కు రూ.21,000 లను పూర్వ విద్యార్థులు అందించారు.
- చిట్యాల జెడ్పీహెచ్‌ఎస్ 1994–95 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు తమతో కలిసి చదువుకున్న దివ్యాంగురాలైన పి.యాసమ్మ ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని తెలుసుకుని రూ.10 వేలు అందించారు. తమ స్నేహితురాలు కె.విజయలక్ష్మీ భర్తకు అనారోగ్యంతో ఉంటే వైద్య చికిత్స ఖర్చులకు రూ.55 వేలు అందించారు. అంతేకాకుండా తాము చదువుకున్న స్కూల్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుకు గాను రూ.25 వేలు అందించారు.
- చిట్యాల జెడ్పీహెచ్‌ఎస్ 1996–97 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన గండమల్ల శంకర్ తల్లి మృతి చెందడంతో వారి కుటుంబానికి రూ.10,016 అందజేశారు.
- చిట్యాల జెడ్పీహెచ్‌ఎస్ 1995–96 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన ఎండీ.జులేఖ బేగం భర్త జావీద్ మృతి చెందాడు. దీంతో ఆమెకు రూ.10 వేలు, అనారోగ్యానికి గురైన గుంటోజు యాదగిరికి రూ.10 వేలు అందజేశారు.
- పెద్దకాపర్తి జెడ్పీహెచ్‌ఎస్‌లో 2013–14 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన దొడ్డి రాజేష్ మృతి చెందాడు. దీంతో అతని కుటుంబానికి రూ.15 వేలు అందించారు.
- ఆరెగూడెం గ్రామానికి చెందిన దుకణాల రాంబాబు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతడితో కలిసి చదువుకున్న పెద్దకాపర్తి జెడ్పీహెచ్‌ఎస్ 2000–01 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు రూ.82,500 మృతుడి కుటుంబానికి అందించారు.
- వెలిమినేడు గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్ 2005–06 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థి కూరాలకు సురేష్ భార్య మమత అనారోగ్యానికి గురైంది. ఆమె వైద్య చికిత్స ఖర్చులకుఅతడితో కలిసి చదువుకున్న స్నేహితులు రూ.40 వేలు అందించారు. ఇదే పాఠశాల 1998–99 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థి చిన్నం బీరయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో స్నేహితులు రూ.73 వేలు అందించారు.
- చిన్నకాపర్తి జెడ్పీహెచ్‌ఎస్ 2003–04 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన స్వామి భార్య నిఖిత మృతి చెందింది. దీంతో అతడితో కలిసి చదువుకున్న స్నేహితులు రూ.50 వేలు అందించారు.
- నేరడ గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్ 1995–96 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థి లొడంగి సత్యనారాయణ ఇటీవల మృతి చెందాడు. దీంతో అతడితో కలిసి చదువుకున్న స్నేహితులు రూ.36,500 బాధిత కుటుంబానికి అందించారు.
- ఉరుమడ్ల జెడ్పీహెచ్‌ఎస్ 1997–98 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన ఉయ్యాల లింగస్వామి అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతడితో కలిసి చదువుకున్న స్నేహితులు బాధిత కుటుంబానికి రూ.1,25,000 అందజేశారు. ఇలా ఆపదలో ఉన్న, మృతి చెందిన బాల్య స్నేహితుల కుటుంబాలకు ఆర్థిక భరోసా ఇస్తున్న పూర్వ విద్యార్థులను పలువురు అభినందిస్తున్నారు.

ఆర్థిక సహాయం అందిస్తున్నాం



చిట్యాల జెడ్పీహెచ్‌ఎస్ 1998–99 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన వారమంతా ప్రతిఏటా పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకుంటాం. ఆ సందర్భంగా మాతో కలిసి చదువుకున్న వారిలో ఇబ్బందుల్లో ఉన్న వారిని, అనారోగ్యంతో ఉన్న వారిని, మృతి చెందిన స్నేహితుల కుటుంబాలను గుర్తించి ఆర్థిక సహాయం అందిస్తూ వస్తున్నాం.

– జిట్ట చంద్రకాంత్, చిట్యాల

వార్డుల్లో సమస్యల పరిష్కారానికి కృషి



1వ వార్డులో పర్యటిస్తున్న మున్సిపల్ చైర్మన్

నకిరేకల్ : మున్సిపాలిటీ కేంద్రంలోని అన్ని వార్డుల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. నకిరేకల్‌లోని 1వ వార్డులో మంగళవారం గుడ్ మార్నింగ్ ప్రోగ్రాంలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా వార్డుల్లో సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు యల్లపురెడ్డి సైదిరెడ్డి, 1వ వార్డు కౌన్సిలర్ కందాళ భిక్షంరెడ్డి, నాయకులు సోమ యాదగిరి, అమీర్‌పాషా, రాచకొండ వెంకన్న, రాచకొండ శ్రవణ్, పెండెం సదానందం, బెల్లి మల్లేష్, చెవుగోని లక్ష్మణ్, పోతుల రవీందర్, పరమేష్, పాదుగు లక్ష్మయ్య, జగన్, గుండ్ల వెంకన్న, కనుకుంట్ల మాధవరెడ్డి, హరీశ్, జమదగ్ని తదితరులు ఉన్నారు.

చంద్ర రాజేశ్వర్‌రావుకు నివాళి

నల్లగొండ టౌన్ : దేశవ్యాప్తంగా భూ పోరాటాలకు నాయకత్వం వహించిన సీపీఐ అగ్ర నాయకుడు దివంగత చంద్ర రాజేశ్వర్‌రావు జీవితం ఆదర్శనీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. చంద్ర రాజేశ్వర్‌రావు 109వ జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నెల్లికంటి సత్యం మాట్లాడుతూ చంద్ర రాజేశ్వర్ రావు పోరాట స్ఫూర్తితో ప్రజల పక్షం నిలబడి ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్.శ్రవన్‌కుమార్, బరిగెల వెంకటేష్, గాదెపాక రమేష్, విశ్వనాథుల లెనిన్, ముండ్ల ముత్యాలు, సకినాల అంజయ్య, పద్మ, సూర్యకుమార్ పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు



తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారి సుచరిత

నల్లగొండ టౌన్ : పట్టణంలోని పలు విత్తనాల దుకాణాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ జిల్లా అధికారి వై.సుచరిత తనిఖీలు నిర్వహించారు. ఆయా దుకాణాల్లో పత్తి, వరి విత్తనాల స్టాకు, రికార్డులను పరిశీలించారు. నకిలీ విత్తనాలు విక్రయించవద్దని, ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువ ధరలకు విత్తనాలు విక్రయించవద్దని దుకాణదారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దుకాణదారులను హెచ్చరించారు. ఆమె వెంట నల్లగొండ ఏడీఏ శ్రవన్‌కుమార్, ఏఓ సుమన్ ఉన్నారు.

గ్రూప్–1 పరీక్ష నిలిపివేయాలి

రామగిరి(నల్లగొండ) : టీఎస్‌పీఎస్సీలో కొత్త బోర్డు సభ్యులను నియమించే వరకు గ్రూప్–1 పరీక్ష నిలిపివేయాలని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనుమలు సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా గ్రంథాలయం ఎదుట నిరుద్యోగులతో కలిసి హాల్‌టికెట్లను దహనం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ గ్రూప్–1 పరీక్ష పత్రం లీకేజీ వ్యవహారం తేలకముందే అదే కమిటీతో పరీక్ష నిర్వహించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, జానీ, రాజశేఖర్, సందీప్, శంకర్, బద్రి పాల్గొన్నారు.



హాల్ టికెట్లను దహనం చేస్తున్న నిరుద్యోగులు

కొనసాగుతున్న బడిబాట

మర్రిగూడ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు చేపట్టిన ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమం మండల వ్యాప్తంగా మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థుల వివరాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిట్యాల : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని వెలిమినేడు సర్పంచ్ దేశబోయిన మల్లమ్మ పాపయ్య అన్నారు. వెలిమినేడు గ్రామంలో మంగళవారం నిర్వహించిన అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మూడేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలు పంపించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు ఎం.అండాలు, పి.పద్మ, వి.సునిత, ఆయాలు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.